క్లుప్తంగా

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ కామూరి అమూల్య తెలిపారు. కొమరోలులోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే జీవితంలో ఎలాంటి సమస్యలపైనైనా పోరాడవచ్చని తెలిపారు. వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు, ఫిషర్ ఉమన్, భవన నిర్మాణ కార్మిక మహిళలు, వికలాంగ మహిళలు ప్రతి ఒక్కరూ వారికి లభించే హక్కులపైన పోరాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వలి, ఈవోపీఆర్‌డీ బ్రహ్మయ్య, న్యాయవాదులు, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పశుగణన సర్వే త్వరితగతిన పూర్తి



పశుగణన సర్వేను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి

కొనకనమిట్ల: అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గొట్లగట్టు పశు వైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొట్లగట్టు, నాయుడుపేట, చినమనగుంటం గ్రామాల్లో జరుగుతున్న పశుగణన సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయా గ్రామాల్లో పశుగణనకు సంబంధించి పశు పోషకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పశు వైద్యాధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 81 శాతం సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పశుపోషకులు తమ పశువులు, జీవాలు, కోళ్లు తదితర వివరాలు తెలియజేయాల్సి ఉందన్నారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, నాయక్, పశుపోషకులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం సాయంత్రం కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి, సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఆరేళ్లుగా క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నామన్నారు. సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘం నాయకులు జీవీ నారాయణరెడ్డి, జీసీహెచ్ వెంకటరెడ్డి, కె.రమణారెడ్డి, పి.రామిరెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, సీహెచ్ రామిరెడ్డి, యోగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.



ఎర్రనల్లి సోకిన మిర్చిపైరు



కత్తెర తెగులు సోకిన మొక్కజొన్న పైరు



ఎర్రనల్లి సోకడంతో వాడిన మిర్చి మొక్క

పంటలపై తెగుళ్ల పంజా

- మిర్చికి ఎర్రనల్లి, మొక్కజొన్నలో కత్తెర, మినుములో బూడిద తెగులు
- దిగుబడులపై రైతుల ఆందోళన

మార్కాపురం:

వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులు తెగుళ్లతో ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే దశలో వివిధ రకాల తెగుళ్లు ఆశించడంతో వాటితో దిగుబడులు తగ్గుతాయని, ఏం చేయాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నా ఫలితం ఉండటం లేదని అంటున్నారు. ముఖ్యంగా మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లో సాగవుతున్న మిర్చికి ఎర్రనల్లి, మొక్కజొన్నలో కత్తెర, మినుములో బూడిద తెగులు ఆశించింది. ఈ పైర్లపై తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో సాగు చేసిన రైతులు వీటి నివారణకు అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు అకాల వర్షాలు మిర్చి రైతులను కుంగదీస్తున్నాయి. మార్కాపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి.

ఎకరాల్లో వివిధ పంటల సాగు ఇలా..

మండలం	మిర్చి	మొక్కజొన్న	మినుము
మార్కాపురం	2657.52	32.17	202.75
పెద్దారవీడు	4543.83	6.07	135
తర్లుపాడు	1520.42	59.89	741.4
అర్ధవీడు	2207.97	804	0
కంభం	342.23	48.80	72.87



బూడిద తెగులు సోకిన మినుము చేను



కత్తెర తెగులు సోకిన మొక్కజొన్న మొక్కలు

మిర్చికి ఎర్రనల్లి తెగులు

పశ్చిమ ప్రకాశంలో సాగవుతున్న మిర్చికి ఎర్రనల్లి తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనినే నల్లతామర అని కూడా అంటారు. ఈ తెగులు సోకిన చెట్టు, ఆకు పూర్తిగా దెబ్బతింటుంది. తామర పురుగు పూత, ఆకును తినడంతో పాటు రసం పీల్చుతుంది. ఆకు ముడత పడుతుంది. ఈ పురుగు ప్రభావంతో మిర్చితోటలు వెలవెలబోతున్నాయి. ఎకరాకు సుమారు లక్ష రూపాయలకు పైగా ఖర్చు పెట్టి సాగు చేసిన రైతులు వీటి నివారణకు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నారు.

మొక్కజొన్నకు కత్తెర తెగులు

మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాల్లో సాగవుతున్న మొక్కజొన్నకు కత్తెర తెగులు సోకింది. ఇప్పుడిప్పుడే పైరు ఎదుగుతున్న దశలో కత్తెర పురుగు సోకడంతో పైర్లలో ఎదుగుదల లోపించింది. దీనినే లద్దెపురుగు అంటారు. ఆకు మొదళ్లలో చేరి రసాన్ని పీల్చి ఆకులను తింటుంది. రైతులు నివారణ కోసం మందులు వాడుతున్నా పురుగుమందు కొట్టిన వెంటనే వర్షం పడటంతో ఉపయోగం లేకుండా పోతోంది.

మినుములో బూడిద తెగులు

ఈ ఏడాది సాగుచేసిన మినుము పంటకు బూడిదె తెగులు సోకడంతో పంట పూర్తిగా పోయినట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనితో పాటు అక్కడక్కడా ఎండు తెగులు, మారుకా మచ్చ తెగులు కూడా ఆశించింది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో బూడిదె తెగులు ఎక్కువైంది. దీంతో పంట మొత్తం నాశనమైనట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చే అవకాశం ఉంది. బూడిద తెగులు సోకడంతో దిగుబడి పూర్తిగా పోయినట్లేనని రైతులు అంటున్నారు.

మొక్కజొన్నకు కత్తెర సోకింది



మూడెకరాల్లో మొక్కజొన్న వేశా. పైరు రాగానే కత్తెర తెగులు సోకింది. చేనంత పురుగు సోకడంతో పైరులో ఎదుగుదల లోపించింది. వివిధ రకాల మందులు వాడుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు. పెట్టుబడి కూడా ఎక్కువగానే పెట్టా. దిగుబడులు ఎలా వస్తాయోనన్న ఆందోళన ఎర్పడింది. దీంతో పాటు 4 ఎకరాల్లో మిర్చి కూడా వేశా. ఎర్రనల్లి సోకింది. వీటి నివారణకే ఈ వారంలో సుమారు 20 వేల రూపాయలకుపైగా పురుగు మందుల కోసం ఖర్చు పెట్టా.

– గుండారెడ్డి లక్ష్మిరెడ్డి, మిర్చి రైతు, వేములకోట

ఆందోళన చెందొద్దు



మిర్చి సాగు చేసిన రైతులు ఎర్రనల్లి లేదా నల్లతామర సోకితే నివారణకు ఎకరాకు స్పైనో సార్డ్ 75 ఎంఎల్‌ను 100 లీటర్ల నీటికి కలిపి 10000 పీపీఎం వేపనూనెతో పిచికారీ చేసుకోవాలి. కత్తెర పురుగు సోకిన మొక్కజొన్న పైరుపై ఇమామెక్టీమ్ బెంజోయేట్ మందును 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలి. లేదా ఫ్లూబెండామైడ్ 50 మి.లీ నీటిలో కలుపుకుని ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. బూడిద తెగులు సోకిన పొలానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్డిజం లేదా డయోఫానెట్ మిథైల్‌ను 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

– దేవిరెడ్డి శ్రీనివాసులు, ఏఓ, మార్కాపురం

మిర్చికి నష్టమే



మూడెకరాల్లో మిర్చి సాగు చేశా. ఎర్రనల్లి సోకింది. ఈ వారంలో తెగుళ్ల నివారణకు సుమారు 15 నుంచి 18 వేల రూపాయల వరకూ ఖర్చు పెట్టా. ఎర్రనల్లితో ఆకు ముడత వచ్చింది. అక్కడక్కడా పూత వచ్చినా తెగులు సోకడంతో ఎదుగుదల లేదు. దీంతో అనుకున్న విధంగా దిగుబడులు రావని భయంగా ఉంది.

– తుమ్మా శ్రీనివాసరెడ్డి, మిర్చి రైతు, గొట్టిపడియ

వైష్ణవాలయాల్లో తిరుప్పావై పూజలు

మార్కాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని పలు వైష్ణవాలయాల్లో స్వామి వార్లకు గోదాదేవి అమ్మవారికి తిరుప్పావై ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం పట్టణంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి, భూనీల సమేత వెంకటేశ్వర స్వామివారికి, కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం అభిషేకాలు, అర్చన తదితర పూజలు చేసింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళా భక్తులు విష్ణు సహస్ర నామంతో పాటు తిరుప్పావై పాసురాలను కూడా భక్తి శ్రద్ధలతో చదువుతున్నారు. స్వామి, అమ్మవార్లను తులసి మాలతో పాటు వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు

గిద్దలూరు రూరల్: టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్స్ సీఏజీ సభ్యురాలు బి.శారద అన్నారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో కాగ్ మెంబర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జీవో హోమ్ కార్యాలయంలో శనివారం టెలికాం వినియోగదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనుచిత వ్యాపార ప్రకటనల నుంచి ఇబ్బంది అనిపిస్తే మీ మొబైల్‌లో నుంచి స్టార్ 0 టైప్ చేసి1909 ఎస్‌ఎంఎస్ పంపితే అనుచిత ప్రకటనలు రావని తెలిపారు. మొబైల్స్ వాడకంలో జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. త్వరలో అన్ని టవర్లకు 3 జీ నుంచి 4 జీ సర్వీసెస్‌గా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ప్రధానంగా సైబర్ క్రైమ్ నుంచి వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా టెలికాం వినియోగదారులకు సంబంధించిన అవగాహన పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ అధికారి రాజేష్, రామకృష్ణ ధ్యాన మందిరం అధ్యక్షుడు పి.హనుమంతారెడ్డి, పొదుపు గ్రూపు మహిళలు పాల్గొన్నారు.



వినియోగదారుల అవగాహన పత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఆధార్ అప్డేషన్ వేగవంతం చేయాలి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి



ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

పొదిలి రూరల్: గ్రామ సచివాలయాల్లో 0–6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అన్నారు. శనివారం పొదిలి మండలంలోని ఏలూరు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0–6 సంవత్సరాల పిల్లల ఆధార్ అనుసంధానంతో పాటు మిస్సింగ్ ఎంప్లాయీస్ సిటిజన్ సేవల సర్వే వివరాలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జి. శోభన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అడవికి నిప్పు.. మనుగడకు ముప్పు



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

అర్ధవీడు: మండలంలోని గన్నేపల్లి గ్రామంలో ''అడవికి నిప్పు మనుగడకు ముప్పు'' అంశంపై డప్పు కళాకారులతో బుర్రకథ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి డిప్యూటీ రేంజ్ అధికారి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవర్చుకోవాలన్నారు. గ్రామ ప్రజలకు ఏవైనా సమస్యలుంటే అటవీశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, బీట్ అధికారి గఫార్, రాజేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకోవాలి

పొదిలి రూరల్: రైతులు ఆధునికత సాంకేతికతను అందిపుచ్చుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌కే జైన్ లాబ్దిన్ సూచించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు శనివారం మండలంలోని మల్లవరం, కొస్టాలపల్లి గ్రామాల్లో కంది, బొబ్బర్లపై డ్రోన్ సాయంతో మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులు పిచికారీతో రైతులు తీవ్ర ఆరోగ్య సమస్యలతో పాటు ఖర్చు కూడా అధికమవుతుందన్నారు. వాటి నివారణకు రైతుల పొలాల్లో తెగుళ్ల నివారణ, ఎరువులు, పురుగు మందు పిచికారీ వంటి అనేక అంశాల్లో డ్రోన్లను వినియోగించడం పరిపాటిగా మరిందన్నారు. ఇప్పుడు వీటి సేవలు అంతట విస్తరించాయన్నారు. డ్రోన్లతో అలాంటి ప్రమాదంతో పాటు కూలీల సమస్య ఉండదన్నారు. స్ప్రేయర్లతో ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరమైతే, డ్రోన్‌తో 10 లీటర్లు సరిపోతుందన్నారు. చేతి పంపుతో రెండు ఎకరాల్లో పిచికారీ ఐదారు గంటలు పడుతుందని, డ్రోన్‌తో ఐదారు నిమిషాల్లోనే ఎకరా పూర్తవుతుందన్నారు. డ్రోన్‌తో మొక్క అడుగు నుంచి పై వరకు తడవడంతో నేలలోని తేమ, చీడపీడలు తీవ్రత తెలుసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ పథకం ద్వారా డ్వాక్రా మహిళకు 80 శాతం సబ్సిడీతో డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ ఇచ్చి మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి సాధించే విధంగా కృషి చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కిసాన్ డ్రోన్ ద్వారా 80 శాతం సబ్సిడీ ఇచ్చి ట్రైనింగ్ ఇస్తారన్నారు. పొదిలి మండలంలో కొస్టాలపల్లికి చెందిన దొండేటి వెంకటేశ్వర్లు, కంభాలపాడుకు చెందిన కృష్ణారెడ్డి ఇప్పటికే డ్రోన్‌లపై శిక్షణ తీసుకున్నారని చెప్పారు. ఇప్పటికే దాదాపు 500 ఎకరాల్లో డ్రోన్లతో పిచికారీ చేసినట్లు తెలిపారు.



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న దొండేటి వెంకటేశ్వర్లు

మూడు సెంట్ల స్థలం వితరణ

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం నూతన భవన నిర్మాణం కోసం మూడు సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి వితరణగా ఇస్తానని కాసు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఎన్‌ఆర్‌ఐ కాసు వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. శనివారం దర్శి రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఆయన సందర్శించారు. సేవా కార్యక్రమాలను అభినందిస్తూనే తన వంతు విరాళంగా మూడు సెంట్ల స్థలాన్ని ఇస్తానని చెప్పారు. సేవలకు మరింతగా సాయం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మువ్వల పార్థసారథి, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి కె.యల్లమందారెడ్డి, అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శి బండి అశోక్, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, యక్కలి శేషగిరిరావు, భూమా సుమంత్, పేర్ల శ్రీనివాసరావు, కాటూరి వెంకట నారాయణబాబు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జి.శ్రీనివాసులు, వరికుంట్ల వినోద్, మామిడి వెంకటేశ్వర్లు, బొగ్గవరపు శ్రీనివాసులు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



వెంకటేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న మానవత సభ్యులు

ఎంపీడీఓపై దాడికి నిరసన

కొనకనమిట్ల: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు ఆందోళనకు దిగారు. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే సానుకూలంగా పరిష్కరించుకోవాలే తప్ప అధికారులపై దాడులు చేయటం మంచిది కాదన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

విద్యాభివృద్ధికి ఎస్‌ఎంసీల సహకారం అవసరం

- ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి

పొదిలి: విద్యాభివృద్ధితో పాటు పాఠశాలలో సౌకర్యాల ఏర్పాటుకు, విలువలతో కూడిన విద్యను అందించేందుకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సహకారం అవసరమని ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఎస్‌ఎంసీ కమిటీల ఒక రోజు శిక్షణ శనివారం ఇచ్చారు. కార్యక్రమాన్ని డీఈఓ కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. లింగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ స్థాయి విద్యార్థులకు ఆ స్థాయి సామర్థ్యాలు వచ్చేలా ఉపాధ్యాయులు, కమిటీ కృషి చేయాలన్నారు. డీఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కమిటీలు విద్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. శిక్షకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వీరి వెంట ఎస్‌ఎస్‌ఏ సీఎంఓ సోనీరుత్, డిప్యూటీ డీఈఓలు చంద్రమౌళి, శ్యామ్యూల్ జాన్, ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి, సీఆర్‌పీలు, ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌తో సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న శ్రీనివాస ప్రసాద్

మార్కాపురం రూరల్: లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని, సామాజిక దృక్పదం ఉన్న వారు లయన్స్ క్లబ్‌లో చేరాలని జోనల్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మార్కాపురంలో లయన్స్ క్లబ్ ఏర్పాటులో భాగంగా శనివారం సాయంత్రం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవకు డబ్బే ముఖ్యం కాదని, సేవ చేయాలన్న తపన ఉంటే చాలన్నారు. ఖాళీ సమయాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదికన్నారు. మార్కాపురంలో లయన్స్ క్లబ్ ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామని జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కంభం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బీవీ రామకృష్ణ, మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపని కాశయ్య, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, బీవీ రంగయ్య, మొఘల్ మహబూబ్ బేగ్, శిరిగిరి వెంకట్రావు, టి.బాలరంగారావు పాల్గొన్నారు.

అనధికారిక ఫ్లెక్సీల తొలగింపు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో అనధికారికంగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు తన సిబ్బంది సహాయంతో శనివారం తొలగింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఒక వ్యాపార సంస్థకు చెందిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో అందిన ఫిర్యాదు మేరకు ఫ్లెక్సీ తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొందరు అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, అలాంటి వాటిని కచ్చితంగా తొలగించే చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్డు డివైడర్‌కు అడ్డంగా ఏర్పాటు చేస్తున్నారని అటువంటి వాటికి అనుమతులు ఇవ్వడం కుదరదని తెలిపారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: మార్గశిర మాసం పురస్కరించుకొని మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ కాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అలంకరణలో శ్రీవారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కంభం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన స్థానిక అనంతపురం–అమరావతి హైవే పై శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని హజరత్‌గూడెం గ్రామానికి చెందిన బాలనరసింహులు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై కంభానికి వస్తుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలనరసింహులు తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయాలతో ఉన్న బాలనరసింహులు